# రేషన్ బియ్యం పంపిణీకి బ్రేక్

- మండలంలో 25 రేషన్ దుకాణాలు
- అన్నింటికీ ఒక నెల బియ్యం సరఫరా
- కొంతమందికి బియ్యం ఇచ్చి మూసేసిన దుకాణాలు


వెల్దుర్తిలో మూసిఉన్న రేషన్ దుకాణం

వెల్దుర్తి, జూన్ 19: మూడు నెలల రేషన్ బియ్యం పంపిణీ చేయాలన్న ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతున్నది. బియ్యం సరఫరాలో అంతరాయంతో మధ్యలోనే రేషన్ పంపిణీ నిలిచిపోయింది. రేషన్ డీలర్లు వచ్చిన రేషన్ బియ్యాన్ని లబ్ధిదారులకు మూడు నెలల చొప్పున పంపిణీ చేశారు. వెల్దుర్తి మండలంలో మొత్తం 25 రేషన్ దుకాణాలు ఉన్నాయి. అన్ని రేషన్ దుకాణాలకు ఎప్పటిలాగే ఒక నెల కోటా బియ్యం సరఫరా అయ్యాయి. అప్పటికే ప్రభుత్వం మూడు నెలల రేషన్ను అందిస్తామని ప్రకటించడంతో రేషన్ డీలర్లు లబ్ధిదారులకు మూడు నెలల చొప్పున బి య్యం పంపిణీ చేశారు. దుకాణాల్లో ఉన్న బియ్యం అ యిపోగానే రేషన్ డీలర్లు దుకాణాలు మూసివేశారు. బియ్యం వచ్చిన పదిరోజుల్లోనే అయిపోవడంతో లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు. రేషన్ దుకాణాల వద్దకు వచ్చి చూసి వెళ్తున్నారు. ఈ విషయమై రెవెన్యూ అధికారులను అడుగగా వెల్దుర్తి మండలానికి కేవలం ఒక నెల బియ్యం మాత్రమే వచ్చాయని, వాటిని లబ్ధిదారులకు పంపిణీ చేశారన్నారు. త్వరలోనే మరో రెండు నెలల బియ్యం వస్తాయని రాగానే పంపిణీ చేస్తారని చెబుతున్నారు. ముందస్తు ప్రణాళిక లేకుండా ప్రభుత్వం ఆర్భాటంగా బియ్యం పంపిణీని ప్రారంభించి, పూర్తి బియ్యం పంపిణీ చేయకుండా నిర్లక్ష్యం వహించడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అన్ని పథకాలను మధ్యలోనే వదిలేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం బియ్యం పంపిణీని చివరి వరకు ఇస్తుం దా అని స్థానికులు అనుమానాన్ని వ్యక్తం చేస్తున్నారు.

## ఏడుపాయలకు 30 కాటేజీలు మంజూరుచేయాలి: మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి

పాపన్నపేట, జూన్ 19: ఏడుపాయలకు 30 కాటేజీలు మంజూరు చేయాలని రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డికి వినతిపత్రం ఇచ్చినట్లు మెదక్ మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఏడుపాయలకు నిత్యం వేలాది మంది భక్తులు వస్తుంటారన్నారు. 2007లో ఆలయాన్ని రాష్ట్ర ఫెస్టివల్‌గా ప్రకటించారన్నారు. 2008లో స్టేట్ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా అప్పటి మంత్రి గీతారెడ్డి రూ.1.50 కోట్లు మంజూరు చేసి, కాటేజీలు ఏర్పాటు చేశారని తెలిపారు. ప్రస్తుతం భక్తులకు సరిపడా సత్రాలు లేక చాలా మంది చెట్ల కింద వర్షానికి తడుస్తూ, ఎండకు ఎండుతూ వంటలు చేసుకుంటున్నారని వాపోయారు. కార్పొరేషన్ స్పందించి 30 కాటేజీలు, అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

## హరీశ్ రావును కలిసి మండల నాయకులు



కౌడిపల్లి, జూన్19: మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావును గురువారం బీఆర్ఎస్ కౌడిపల్లి మండల నాయకులు, నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డితో కలిసి వెళ్లి పరామర్శించారు. హరీశ్‌రావు ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు సార రామాగౌడ్, మాజీ ఎంపీటీసీ కిశోర్ గౌడ్, అంజాగౌడ్, మొగులా గౌడ్, ప్రతాఫ్ గౌడ్, సుదీర్ ఉన్నారు.

## సాగులో ఉన్నా పట్టా పాస్‌బుక్కులు ఇవ్వరా?

### – ఆవేదన వ్యక్తం చేస్తున్న రాయిలాపూర్ రైతులు


గోడువెల్లబోసుకుంటున్న రాయిలాపూర్ రైతులు

రామాయంపేట, జూన్ 19: యాభై ఏండ్లుగా భూములు సాగు చేస్తూ పంటలు పండించుకుంటున్నా, ప్రభుత్వం తమకు పట్టా పాసు బుక్కులు ఇవ్వడం లేదని రాయిలాపూర్‌కు చెందిన రైతులు గోడువెల్లబోసుకున్నారు. గురువారం రాయిలాపూర్‌లో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. సదస్సులో తమకు న్యాయం చేయాలని తహసీల్దార్ రజినీకుమారికి రైతులు వినతిపత్రం అందజేశారు. రైతులు మాట్లాడుతూ రాయిలాపూర్ శివారులోని 881 సర్వే నెంబర్‌లో వంద ఎకరాలను 50 మంది రైతులు సాగు చేస్తున్నామన్నారు. తమకు అప్పటి ప్రభుత్వం భూమిలేని పేదలకు ప్రభుత్వ భూమిలో పట్టాలిచ్చిందని, కాని ఇంతవరకు పట్టా పాసు బుక్కులు రాలేదని వాపోయారు. సంబంధిత అధికారులు ప్రభుత్వ భూమి అని, పట్టా పాసుబుక్కులు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

## ప్రభుత్వ భూమిని కాపాడాలని ధర్నా


ప్రభుత్వ భూమిని కాపాడాలంటూ తహసీల్ కార్యాలయం ఎదుట ధర్నా

కౌడిపల్లి, జూన్ 19: ప్రభుత్వ భూమిని కాపాడలంటూ తహసీల్ కార్యాలయం ఎదుట వెల్మకన్న గ్రామస్తులు గురువారం ధర్నా చేశారు. గ్రామ శివారులోని 447 సర్వేనెంబర్‌లో కౌడిపల్లికి చెందిన మోతీలాల్ గౌడ్ అక్రమంగా అసైన్‌మెంటు పట్టా పొందాడని, ప్రభుత్వ భూమిలోని చెట్లు, రాళ్లను తొలిగించి కబ్జా చేస్తున్నాడని ఆరోపించారు. అధికారులకు పలు మార్లు సమాచారం ఇచ్చినా స్పందించడం లేదని. చివరకు తహసీల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్నామన్నారు. నిబంధనలకు విరుద్ధంగా పొందిన అసైన్డ్‌మెంట్ భూమి పట్టాను వెంటనే రద్దుచేయాలని డిమండ్ చేశారు. స్పందించిన ఎమ్మార్వో ఆ భూమిలో సర్వే చేసి చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం ఎమ్మార్వోకు వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు రాజేందర్, గంగాగౌడ్, ఎంపీటీసీ కిషన్, రమేశ్, అశోక్, రాకేశ్, వినోద్, రాజు, మనోహర్, మహేశ్వరి, సు జాత, రవి, జహంగీర్, యువజన సంఘాల నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత



చిన్నశంకరంపేట, జూన్19: ఆధ్యాత్మికతతోనే మానసికి ప్రశాంతత నెలకొంటుందని మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని రుద్రారంలో గ్రామ దేవత పోచమ్మకు నిర్వహించిన బోనాల్లో ఆమె పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆమె వెంట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాజు, మాజీ సర్పంచ్ లక్ష్మణ్, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

## పోలీసులపై దాడిచేసిన వారిపై కేసు నమోదు

చేగుంట, జూన్19: విధి నిర్వహణలో మైనర్ బాలిక ఆచూకీ కోసం వెళ్లిన పోలీసులపై దాడి చేసిన వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చేగుంట ఎస్ఐ చైతన్యకుమార్‌రెడ్డి తెలిపారు. బుధవారం రాత్రి బైంసా టౌన్ పీఎస్‌లో ప్రొబిషనరీ ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న షేక్‌జుబేర్‌తో పాటు పోలీసు సిబ్బంది ఒక కేసులో కిడ్నాప్ అయిన మైనర్ అమ్మాయి ఆచూకీ కోసం ఓ ప్రైవేటు వాహనంలో విచారణలో భాగంగా మెదక్ మండలం పాతూరు గ్రామానికి చెందిన అనుమానితుడిని విచారించారు. మైనర్ బాలిక చేగుంట మండలం బోనాల్ కొండపూర్‌కు చెందిన బ్యాగరి సురేశ్ వద్ద ఉన్నట్లు తెలిపారు. వెంటనే అదే రోజు రాత్రి బీ కొండపూర్‌లోని సురేశ్ ఇంటికి వెళ్లి పోలీసులమని వారి ఐడీ కార్డు చూపించి బాలిక గురించి అడగడంతో సురేశ్, అతడి తండ్రి చంద్రం అమ్మాయి తమ వద్ద ఎందుకు ఉంటుందని, ఉన్నా ఎందుకు చెప్పాలని, బూతులు తిట్టి, దాడి చేశారు. దీంతో మైనర్ బాలికను దాచి పెడితే చట్టపరంగా కేసులు అవుతాయని పోలీసులు చెప్పగా, బ్యాగరి చంద్రం, సురేశ్, రతనవ్వ, వెంకటస్వామి, సంతజీవ్ కలిసి పోలీసులపై దాడి చేశారు. దీంతో ఎస్ఐ, కానిస్టేబుల్‌కు గాయాలయ్యా యి. చేగుంట పోలీసుల వాహనాన్ని అడ్డుకున్నారు. బైంసా ఎస్ఐ షేక్‌జుబేర్ ఫిర్యాదు మేరకు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

### కాలనీవాసులకు వైద్య పరీక్షలు

నిజాంపేట,జూన్19: నిజాంపేటలోని 2,3,4 వార్డు కాలనీవాసులకు స్థానిక ఆరోగ్య ఉప కేంద్రం డాక్టర్ సాయిక్రిష్ణ వైద్య పరీక్షలను గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు అనురాధ, బాలమణి,ఆశవర్కర్లు బాలమణి, అనిత తదితరులు ఉన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
CHANGE OF NAME
★I, MEDA SWATHI, D/o. Palaparthi Raghubabu. Henceforth Changed My Name as PALAPARTHI SWATHI, D/o. Palaparthi Raghubabu.
NT-343000
గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

### చెక్ బోన్స్ కేసులో మాజీ వైస్ ఎంపీపీకి జైలు శిక్ష

చేగుంట,జూన్19:చెక్ బోన్స్ కేసులో చేగుంట మాజీ వైస్ ఎంపీపీ మున్నూర్ రాంచంద్రకు కోర్టు మూడు నెలల సాధారణ జైలు శిక్షను ఖరారు చేసింది. హైదరాబాద్‌కు చెందిన పురోషోత్తం రావు వద్ద గతంలో తీసుకున్న 6.50లక్షల అప్పు తిరిగి ఇవ్వలేదు. 2021లో బ్యాంకు చెక్కులు ఇచ్చాడు. ఆ చెక్కులను పురోషోత్తంరావు బ్యాంకులో వేశాడు. ఆ ఖాతా బ్లాక్‌లో పెట్టడంతో ఆయన కోర్టును ఆశ్రయించారు. విచారణ అనంతరం హైదరబాద్ కోర్టు జరిమానతో పాటు మూడు నెలల జైలు శిక్ష విధించింది.

# సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు

- జిల్లాలో 28,118 దరఖాస్తుల స్వీకరణ
- కలెక్టర్ రాహుల్ రాజ్

టేక్మాల్, జూన్ 19: భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా జిల్లాలో నిర్వహిస్తున్న భూభారతి రెవెన్యూ సదస్సులు 90 శాతం పూర్తైనట్లు కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. టేక్మాల్ మండలంలోని ఎల్లంపల్లి గ్రామంలో గురువారం నిర్వహించిన రెవెన్యూ సదస్సును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 3 నుంచి 20వ తేదీ వరకు చేపట్టిన రెవెన్యూ సదస్సులు సత్ఫలితాలిస్తున్నాయన్నారు. రైతులు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగకుండా గ్రామాల్లోనే సదస్సులు నిర్వహించి భూ సమస్యలపై దరఖాస్తులు స్వీకరిస్తున్నామన్నారు. రెవెన్యూ సదస్సులో వచ్చిన దరఖాస్తులను వెబ్‌సైట్‌లో పొందుపర్చాలని, ఎలాంటి తప్పిదాలు లేకుండా చట్టంలోని నిబంధనలు తప్పకుండా పాటించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ తులసీరాం, ఆర్ఐ సాయిశ్రీకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.


ఎల్లంపల్లి రెవెన్యూ సదస్సులో కలెక్టర్

### ప్రభుత్వ పాఠశాల సందర్శన

బడీడు పిల్లలు ప్రభుత్వ పాఠశాలలో చేరినందుకు ఆదర్శ గ్రామంగా ఎల్లంపల్లి నిలిచిందని కలెక్టర్ రాహుల్ రాజ్ కొనియాడారు. మండలంలోని ఎల్లంపల్లి ప్రాథమిక పాఠశాలను గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తున్నారన్నారు. ప్రాథమిక స్థాయి నుంచే ఇంగ్లిష్ విద్యాబోధన కొనసాగుతుందన్నారు. చదవడం, రాయడం, గణితంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని తెలిపారు.


మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

### ఇందిరమ్మ ఇండ్ల స్థలాల పరిశీలన

ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులతో కలెక్టర్ మాట్లాడారు. ఇండ్ల నిర్మాణం పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కోసం ప్రభుత్వం సూచించిన ప్రకారం ఇసుక, తదితర సౌకర్యాలను నిబంధనల మేరకు కల్పించడానికి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. షెడ్యూలు ప్రకారం ఇళ్ల నిర్మాణం పూర్తి చేయడానికి క్షేత్ర స్థాయిలో లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని సంబంధిత అధికారులకు సూచించారు.

## రైతుభరోసా, ఇందిరమ్మ ఇండ్లు.. కాంగ్రెస్ ఎన్నికల స్టంట్

### జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ చంద్రాగౌడ్



నర్సాపూర్, జూన్19: కాంగ్రెస్ ప్రభుత్వం పేదలపై ప్రేమ ఉన్నట్లు రైతుభరోసా, ఇందిరమ్మ ఇండ్లు అందజేస్తున్నదని, ఇది కేవలం స్థానిక సంస్థల ఎన్నికల స్టంట్ మాత్రమేనని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ చంద్రాగౌడ్ ఎద్దేవా చేశారు. ఆయన మాట్లాడుతూ గత యాసంగి, వానకాలం పంటలకు రైతుభరోసా ఎగ్గొట్టి, ప్రస్తుతం స్థానిక సంస్థల్లో లబ్ధిపొందాలని కాంగ్రెస్ ప్రభుత్వం చూస్తున్నదని మండిపడ్డారు. మూడు ఎకరాల వరకు మాత్రమే రైతుభరోసా వేశారని, మిగతా వారికి వేస్తారన్న నమ్మకం కూడా లేదన్నారు. రైతుబీమాకు ప్రీమియం డబ్బులు కూడా కట్టలేదని గుర్తుచేశారు. ఇందిరమ్మ కమిటీలు వేసి కాంగ్రెస్ కార్యకర్తల ద్వారా ఎంపిక చేసి, ఇండ్లు మంజూరు చేశారన్నారు. ప్రొటోకాల్ పాటించకుండా కాంగ్రెస్ నాయకులే ఇండ్ల నిర్మాణాలకు కొబ్బరికాయలు కొట్టి ముగ్గు పోస్తున్నారన్నారు. 60 గజాల్లోనే ఇందిరమ్మ ఇండ్లు కట్టుకోవాలట, గోడల మీద స్లాబ్ వేసుకోవాలట, వానకాలం మొదలైంది లబ్ధిదారులు ఇండ్లు కట్టుకోడానికి వాతావరణం అనుకూలించక ఇండ్లు కట్టడానికి ఎవరూ ముందుకు రారనే ఉద్దేశంతో మొదలు పెట్టారన్నారు. ప్రభుత్వం ఇదే అదునుగా చూసుకుని ఎన్నికలు పూర్తి కాగానే వీటిని రద్దు చేసే అవకాశాలు ఉన్నాయని జోస్యం చెప్పారు. రైతులు, ప్రజలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తూ పబ్బంగడుపుకుంటున్నదని ఆరోపించారు. నాటుకు నాటుకు మధ్య రైతుబంధు ఇచ్చింది కేసీఆర్ అయితే, ఓట్లకు ఓట్లకు మధ్య రైతుభరోసా ఇస్తున్నది రేవంత్‌రెడ్డి అని ఎద్దేవా చేశారు.

### సీజనల్ వ్యాధులపై జాగ్రత్తలు తీసుకోవాలి

చిలిపిచెడ్, జూన్ 19: సీజనల్ వ్యాధులపై జాగ్రత్తగా ఉండాలని, ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీవో ఆనంద్ తెలిపారు. గురువారం ఫైజాబాద్, గంగారం గ్రామాల్లో పారిశుధ్యంపై అవగాహన కల్పించారు. నర్సరీలో మొక్కలను పరిశీలించారు. అనంతరం ఆయా గ్రామాల కార్యదర్శులతో సమీక్ష సమావేశం ఏర్పాటుచేశారు. సమావేశంలో ఎంపీవో తిరుపతి, ఏపీవో శ్యామ్‌కుమార్ పాల్గొన్నారు.

### బేటీ బచావో.. బేటీ పడావోపై అవగాహన

చిలిపిచెడ్, జూన్ 19: బాల్య వివాహాలు, చైల్డ్ హెల్ప్ నంబర్ 1098, సైబర్ క్రైమ్, హైజీన్ సంరక్షణ గురించి, బేటీ బచావో.. బేటీ పడావో పై విద్యార్థులకు జిల్లా మహిళా సాధికారిత టీం డీఎంసీ సంతోషి అవగాహన కల్పించారు. గురువారం మండలంలోని గౌతాపూర్ జడ్పీహెచ్ఎస్‌లో కార్యక్రమం నిర్వహించారు. సిబ్బంది కవిత, నాగమణి, టీచర్లు పాల్గొన్నారు.

### భూమిలో తేమ ఉంటేనే పంట వేయాలి



రామాయంపేట, జూన్ 19: పొలాల్లో సరైన తేమ శాతం ఉంటేనే పంటలు వేయాలని ఇన్‌చార్జి ఏడీఏ రాజ్‌నారాయణ తెలిపారు. గురువారం రామాయంపేట శివారులోని రైతులకు అవగాహన కల్పించారు. వర్షాభావ పరిస్థితుల్లో రైతులు ఆందోళన చెందవద్దన్నారు. వర్షాలు కురిసినప్పుడే పంటలు వేసుకోవాలన్నారు. ఏఈవోలు సాయికృష్ణ, ప్రవీణ్, రాజు ఉన్నారు.

### ఇందిరమ్మ ఇండ్లకు భూమిపూజ



నిజాంపేట, జూన్ 19: నగరంలో మంజూరైన ఇందిరమ్మ ఇండ్లకు ఎంపీడీవో రాజిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి ఆరిఫ్ హూస్సేన్ గురువారం భూమిపూజ చేశారు. గ్రామంలో ఎల్లవ్వ, లక్ష్మీ, మంజుల ఇండ్ల నిర్మాణాలు చేపట్టినట్లు తెలిపారు. వారితో హౌసింగ్ ఏఈ సంధ్య, భాగ్యలక్ష్మి ఉన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి


లునావత్ పీర్యా (ఫైల్)


కెతావత్ పీర్యా (ఫైల్)

పాపన్నపేట, జూన్ 19: మొక్కులు చెల్లించుకునేందుకు పెద్దగుట్ట దర్గాకు బయలు దేరిన గిరిజనుల బతుకులు మార్గమధ్యలోనే ముగిశాయి. వారు ప్రయాణిస్తున్న కారు ఎల్లారెడ్డి–కామారెడ్డిల మధ్యనున్న మల్లయ్యపల్లి గేటు వద్ద బోల్తా పడింది. దీంతో ఇద్దరు యువకులు దుర్మరణం చెందారు. ఇద్దరు పిల్లలతో సహ మరో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే.. పాపన్నపేట మండలంలోని నర్సింగ్‌రావుపల్లి గిరిజన తండాకు చెందిన లునావత్ పీర్యా(37) సంగారెడ్డిలో డోజర్ నడుపుతూ జీవిస్తున్నాడు. అతడికి భార్య, కొడుకులు సోను, ప్రవీణ్ ఉన్నారు. అదే తండాకు చెందిన కెతావత్ పీర్యా(37)కు భార్య, ఇద్దరు కొడుకులు, కూతురు ఉన్నారు. లునావత్ పీర్యా తన మొక్కు చెల్లించుకోవడానికి తన యజమాని కారు తీసుకుని సంగారెడ్డి నుంచి నర్సింగ్‌రావుపల్లికి బుధవారం వచ్చాడు. తన ఇద్దరు కొడుకులతో పాటు కెతావత్ పీర్యా, వేణుతో కలిసి అదే రాత్రి పెద్దగుట్టకు బయలుదేరారు. ఈ క్రమంలో మల్లయ్యపల్లి గేటు వద్ద కారు బోల్తా పడింది. దీంతో లునావత్ పీర్యా, కెతావత్ పీర్యా మృతిచెందారు. సోనుకు పక్కటెముకలు విరుగాయి. ప్రవీణ్ కాలు విరిగింది. వేణుకు తీవ్ర గాయాలయ్యాయి. పోస్టుమార్టం అనంతరం గురువారం మృతదేహాలను నర్సింగ్‌రావుపల్లికి తీసుకొచ్చారు. గిరిపుత్రుల రోదనల మధ్య ఇద్దరు యువకుల అంతిమ యాత్ర కొనసాగింది.

## భూ భారతి చట్టంలో సమస్యల పరిష్కారం


శివ్వంపేట: రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ నగేశ్

### -అదనపు కలెక్టర్ నగేశ్

పెద్దశంకరంపేట, జూన్19: గ్రామాల్లో భూ సమస్యల పరిష్కారానికి భూభారతి చట్టం అమలు చేస్తున్నట్లు అదనపు కలెక్టర్ నగేశ్ తెలిపారు. గురువారం పెద్దశంకరంపేట మండలం కె.వెంకటాపూర్ గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో పాల్గొన్నారు. దరఖాస్తులు చేసుకున్న ప్రతిఒక్కరి సమస్య పరిష్కరిస్తామన్నారు. తహసీల్దార్ శ్రీనివాస్, తదితరులున్నారు.

### శివ్వంపేటలో..

శివ్వంపేట, జూన్ 19: శివ్వంపేట మండలం నవాబ్‌పేట గ్రామంలో నిర్వహించిన భూభారతి రెవెన్యూ సదస్సులో అదనపు కలెక్టర్ నగేశ్, నర్సాపూర్ ఆర్డీవో మహిపాల్‌రెడ్డి పాల్గొన్నారు. దరఖాస్తుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. సమస్యలు పరిష్కరించి రైతులకు న్యాయం చేయాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కమలాద్రి, డిప్యూటీ తహసీల్దార్ షఫియొద్దీన్ తదితరులు ఉన్నారు.

### రామాయంపేటలో..

రామాయంపేట, జూన్ 19:భూమి సమస్యలపై నిర్లక్ష్యం చేయద్దని భూ భారతిలో తమ సమస్యలను పరిష్కరించుకోవాలని తహసీల్దార్ రజినీకుమారి అన్నారు. రాయిలాపూర్‌లోని రైతువేదికలో రెవెన్యు సదస్సు నిర్వహించారు. వందలాదిగా రైతులు అర్జీలు ఇచ్చేందుకు బారులుదీరారు. సదస్సులో గ్రామ కార్యదర్శి మహేందర్, ఏఈవో సాయికృష్ణ, ఆర్ఐ గౌస్ తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి


తూప్రాన్‌లో...


చిలిపిచెడ్‌లో..

తూప్రాన్, జూన్ 19: సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని తూప్రాన్ డీఎస్పీ నరేందర్ అన్నారు. గురువారం తూప్రాన్ డీఎస్పీ కార్యాలయంలో సైబర్ క్రైమ్ అవేర్‌నెస్ పోస్టర్ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ రకరకాల పద్ధతుల్లో సైబర్ నేరస్తులు మోసాలకు పాల్పడుతున్నారని, అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ రంగకృష్ణ, ఎస్ఐ శివానందం పాల్గొన్నారు.

### చిలిపిచెడ్‌లో..

చిలిపిచెడ్, జూన్ 19: సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని ఎస్సై నర్సింహులు అన్నారు. గురువారం కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా చిలిపిచెడ్‌లో సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. సైబర్ నేరగాళ్లు ఆన్‌లైన్ మోసాలకు పాల్పడుతున్నారని, ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఏఎస్సై రాములు, సిబ్బంది పాల్గొన్నారు.

### నర్సాపూర్‌లో..

నర్సాపూర్,జూన్19: సైబర్ నేరాలపై అవగాహన కల్పించడానికి నర్సాపూర్ పోలీస్ స్టేషన్‌లో సీఐ జాన్‌రెడ్డి, ఎస్సై లింగం గోడపత్రికను ఆవిష్కరించారు. ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయాలు, కోర్టు, బస్టాండ్ తదతర చోట గోడపత్రికలను అంటించనున్నట్లు తెలిపారు.

### కేజీబీవీలో పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

వెల్దుర్తి, జూన్ 19: వెల్దుర్తి కేజీబీవీలో పలు పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వాటి భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంఈవో యాదగిరి, పాఠశాల ఎస్‌వో ఫాతిమా గురువారం ప్రకటనలో తెలిపారు. పాఠశాలలో హెడ్‌కుక్, స్వీపర్, నైట్‌వాచ్‌మెన్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. పదో తరగతి పాస్ అయిన వారు, హెడ్‌కుక్ కోసం పెద్ద మొత్తంలో వంట చేయడంతో పాటు , రెండేండ్ల అనుభవం ఉన్నవారు అర్హులని తెలిపారు. 21 నుంచి 45 ఏండ్ల వయసు కలిగి, వెల్దుర్తిలో నివాసం ఉండేవారు ఈ నెల 24 వరకు స్థానిక పాఠశాలలో దరఖాస్తులు చేసుకోవాలని పేర్కొన్నారు.

### 22న ఉమ్మడి జిల్లా ఫుట్‌బాల్ జట్టు ఎంపిక

మెదక్ మున్సిపాలిటీ, జూన్ 19: ఉమ్మడి మెదక్ జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జూనియర్ బాలుర జట్టు ఎంపిక ఈనెల 22న నిర్వహించనున్నట్లు ఆ అసోసియేషన్ కార్యదర్శి నాగరాజు గురువారం ప్రకటనలో తెలిపారు. మెదక్‌లోని అవుట్ డోర్ స్టేడియంలో ఈ ఎంపికలు ఉంటాయని పేర్కొన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు ఆదివారం ఉదయం 7 గంటలకు రిపోర్టు చేయాలన్నారు. ఆధార్‌కార్డు, వయస్సు ధ్రువీకరణ పత్రం, 2 పాస్‌పోర్టు ఫోటోలు, ఫుట్‌బాల్ కిట్‌తో హాజరు కావాలన్నారు. ఎంపికైన జట్టు 28 నుంచి జూలై 1వ తేదీ వరకు నిజామాబాద్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటుందని పేర్కొన్నారు.

### నిందితుడిపై చర్యలు తీసుకోవాలని వినతి


వినతిపత్రం అందజేస్తున్న స్వామి, నాయకులు

నిజాంపేట,జూన్19: ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైనా నిందితుడిని అరెస్ట్ చేయలేదని, డీబీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సంజీవ్‌తో కలిసి రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యకు బాధితుడు స్వామి ఫిర్యాదు చేశాడు. గురువారం భూంపల్లిలోని ఆయన స్వగృహంలో కలిసి వినతిపత్రం అందజేశారు. బచ్చురాజ్‌పల్లికి చెందిన దళితుడు గాజులపల్లి స్వామిపై తిప్పనగుల్ల గ్రామానికి చెందిన సహవేద్ దాడికి పాల్పడ్డాడని బాధితుడు తెలిపాడు. బాధితుడి విజ్ఞప్తి మేరకు తూప్రాన్ డీఎస్పీకి ఫోన్ ద్వారా నిందితుడిని అరెస్ట్ చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, మాల పరిరక్షణ వేదిక జాతీయ అధ్యక్షుడు మైసయ్య, రాజు ఉన్నారు.


### అదనపు కట్నం తేవాలంటూ వేధింపులు

శివ్వంపేట, జూన్ 19: అదనపు కట్నం తేవాలంటూ భార్యను భర్త వేధించిన ఘటన శివ్వంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై మధుకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కొంతాన్‌పల్లి గ్రామానికి చెందిన దొంతి సారికకు ఐదేండ్ల క్రితం దొంతి కిశోర్‌తో వివాహం జరిగింది. వివాహ సమయంలో సంప్రదాయం ప్రకారం బంగారం, సామగ్రి అన్ని పెట్టారు. వివాహం అనంతరం సంవత్సరం పాటు బాగానే చూసుకున్నాడు. ఆ తరువాత తన తల్లిగారి ఇంటి నుంచి అదనపు కట్నం తీసుకురావాలంటూ తన భర్త వేధిస్తున్నాడని, అత్త పద్మ, మామ యాదగిరి, మరిది దినేశ్ తన భర్తకు లేనిపోని మాటలు చెప్పి మానసికంగా వేధింపులకు గురిచేస్తున్నారని ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. పెద్దల సమక్షంలో మాట్లాడినా వారిలో మార్పు లేదన్నారు. ఈ విషయమై తనకు న్యాయం చేయాలని సారిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

### పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

రామాయంపేట, జూన్ 19: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పరిసరాలు శుభ్రంగా ఉండాలని, లేకుంటే సీజనల్ వ్యాధుల బారిన పడే అవకాశం ఉందని డి.ధర్మారం పీహెచ్‌సీ వైద్యురాలు హరిప్రియల తెలిపారు. గురువారం రామాయంపేటలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శిరీష, సిబ్బంది, లెక్చరర్లు పాల్గొన్నారు.

### చేగుంట లయన్స్‌క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక



నియామక పత్రాన్ని అందుకుంటున్న శ్రీనివాస్

చేగుంట, జూన్19: చేగుంట లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని లయన్స్ పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ శ్యామ్‌కుమార్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. గురువారం చేగుంటలోని సాయిబాలాజీ గార్డెన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో అధ్యక్షుడిగా శంబుని శ్రీనివాస్‌కు బాధ్యతలు అప్పగించారు. నూతనంగా ఎన్నికైన శ్రీనివాస్‌కు పలువురు అభినంధనలు తెలిపారు. కార్యక్రమంలో వైస్ డిస్ట్రిక్ గవర్నర్ విజయలక్ష్మి, నర్సింహరాజు, రీజియన్ చైర్మన్ పంజేయ్‌గుప్తా, జోన్ చైర్‌పర్సన్ సుకేందర్, శ్రీనివాస్‌రెడ్డి, ప్రవీణ్, లయన్ పద్మావతి, ఫణిధర్, పరమేశ్వరాచారి, శ్రీనివాస్, శ్రీధర్, లింగమూర్తి, మనోహర్‌రావు, నర్సింహులు, గజ్వేల్ జోన్ చైర్మన్ మల్లేశంగౌడ్, చేగుంట కార్యదర్శి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

### రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి



మాట్లాడుతున్న వాహనాల తనిఖీ అధికారి విజయలక్ష్మి

చిన్నశంకరంపేట, జూన్19: వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలు పాటిస్తూ వాహనాలు నడపాలని తనిఖీ అధికారిని విజయలక్ష్మి తెలిపారు. గురువారం చిన్నశంకరంపేటలోని ప్రైవేటు పాఠశాల బస్సులను స్థానిక ఎస్సై నారాయణతో కలసి తనిఖీ చేశారు. మోతాదుకు మించి బస్సుల్లో విద్యార్థులను ఎక్కించకూడదని వాహనాల ఫిట్‌నెస్‌ను తప్పనిసరిగా చేయించాలని యాజమాన్యానికి సూచించారు.

### దాతలకు సన్మానం



నిజాంపేట, జూన్ 19: రాంపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల అభివృద్ధికి కృషి చేసిన దాతలను హెచ్ఎం పద్మారెడ్డి గురువారం సన్మానించారు. పాఠశాలకు కంప్యూటర్‌ను బహూకరించిన అదే గ్రామానికి చెందిన దాత శ్రీకాంత్ తల్లిదండ్రులను, రోజూ పాఠశాలకు మినరల్ వాటర్‌ను ఉచితంగా అందిస్తున్న దాత అంజాగౌడ్‌ను సన్మానించారు.